# వల

బెహరా
వెంకట
సుబ్బారావు



ఏజన్సీ కొండల్లో బాగా వర్షాలు పోతుంది. సిమెంటు రోడ్డుమీదనుంచి పడటంతో యేరు బాగా పారుతోంది. పొర్లుకొని పారుతోంది నీరు. రోడ్డుకి ఆ ఏజన్సీకి పోయేరోడు ఆ యేటిలోంచే ఒక ప్రక్కగా చేపలవల వేసుకొని

నిలబడ్డాడు సింహాచలం. బాగా రాత్రి అయింది వెన్నెల గుడ్డిగా వుంది మబ్బుల వల్ల వెనుక దగ్గుకొంటూ ఎవరో వస్తూన్న అలికిడి అయింది. "అసిరియ్య మావగావాల!" అనుకొన్నాడు సింహాచలం.

వెనక్కి తిరిగి చూడకుండానే దగ్గు దగ్గర పడగానే అడిగాడు సింహాచలం.

"అసిరియ్య మావా! రావులుదద్ద తాలేదా?"

సింహాచలం ప్రశ్నకి జవాబీయలేదు అసిరియ్య

"ఏమైనా పల్లో పడతాయంటా వేటిరా?" అడిగాడు అసిరియ్య నోట్లోంచి చుట్టను బయటకు తీయ కుండానే.

"ఓ బండీ రానేదు మావా!" నిరుత్సాహంగా అన్నాడు సింహాచలం

"వత్తాయ్‌రా! గురవడు కూడా వలేసుకొని వత్తున్నాడు! ఊళబోతు నాయాల!"

అంటూ దగ్గరగా వెళ్ళి రాతిమీద చతికిలపడ్డాడు అసిరియ్య

సింహాచలం వలని ఒకసారి బయటకు తీసి చేత్తో తడిమి మరలా నీటిలో ముంచాడు సగం కాల్చి దాచిన చుట్టపీకను మొల్లోంచి బయటకు తీసి అడిగాడు.

"ఓ పాలి అగ్గిపెట్టియ్య మావా!"

"అగ్గిపెట్టి నేదురా! ఇంద కాల్చు!" గట్టిగా దమ్ములాగి చుట్టని అందించాడు అసిరియ్య

"అవునుగానీ! రావులుదద్ద ఇంకా రానేదేటి?" చుట్టను తిరిగి అందిస్తూ మరలా అడిగాడు సింహాచలం.

"ఆడెక్కడున్నా సమయానికి గెద్దలా వచ్చి వాల్తాడు! పట్నంలో తాగేసి ఎక్కడ పడున్నాడో! లాట్టు బండి యింకా రానేదుగందా! అందులో వత్తాడు లే!"

విసుగుదలా అసూయా కన్పించ నీయకుండా సౌమ్యంగానే జవాబు చెప్పాలని ప్రయత్నించాడు అసిరియ్య. రావులుదద్దంటే అసిరియ్యకు వొళ్ళు మంట.

ఆ యేటికి ఫర్లాంగు దూరంలో ఓ పల్లె వుంది. ఏజన్సీ కొండల్లో పుట్టింది కాబట్టి ఆ యేట్లో ఎప్పుడూ నీరు పారుతూ వుంటుంది. ఆ రోడ్డుకి అంత ప్రాముఖ్యత లేదనో లేక ధనాభావం వల్లనో ప్రభుత్వంవారు అక్కడ ఆ యేటిమీద బ్రిడ్జిని కట్టలేదు. రమారమి అరఫర్లాంగు వెడల్పుగల ఆ యేటిలో సిమెంటురోడ్డు వుంది. వెడల్పు ఎక్కువగా లేదు అలవాటయిన లారీలూ, బస్సులూ అంచనా ప్రకారం జాగ్రత్తగా పోతాయ్. ఎటొచ్చీ కొత్త డ్రైవర్లకే యిబ్బంది. ఒకడుగు అటు వెళ్ళినా యిటు వెళ్ళినా యిసుకలోకి దిగిపోతాయ్ వాహనాలు! అప్పుడు

డైవ్రర్లు పడే అవస్థ అంతా యింతా కాదు. సహాయం కోసం అటూ యిటూ చూస్తారు. అవకాశం కోసం ఎదురు చూసే ఆ పల్లెవారు ఆ అదను చూసు కొని బ్రతిమాలించుకొని సహాయానికి దిగుతారు. ప్రతిఫలాన్ని గట్టిగా డిమాండు చేస్తారు. వరద వచ్చిందంటే వారి ఆనందం అంతా యింతా కాదు. ఇద్దరి మనుషుల్ని యేటి దగ్గర కాపలా వుంచుతారు. వారు యేదో పని చేసు కొంటూ వుంటారు. పశువుల్ని కాచుకొంటూనో, ఏట్లో వలలు వేసుకొని చేపలు పడుతూనో వుంటారు. వలలో చేపలు పడకపోయినా పరవాలేదు! వారి దృష్టి అసలు వలపైనే వుండదు! రోడ్డు మీదనే వుంటుంది వారి చూపు, ఏవైనా కొత్త బళ్ళు రాకపోతాయా, కూరుకొని పోకపోతాయా! అన్న ఆశతో. బండి యిసుకలో కూరుకొనిపోగానే పదిమందీ జట్టుగాపోయి దాన్ని వొడ్డుకి చేరుస్తారు. వాళ్ళిచ్చిన డబ్బును సమానంగా పంచు కొంటారు అదో రకం జీవనోపాధి!

అయితే వాళ్ళలోనూ పార్టీలు వచ్చి పడ్డాయ్! పోటీలు పడటంతో రాబడి తగ్గిపోయింది.

అలాంటి సమయంలో ఎక్కడ్నుంచో వూడిపడ్డాడు రావులుదద్ద. రావులుదద్దది అసలు ఆ గ్రామమే! పదిహేను సంవత్సరాల క్రితం వూరు వదిలి పోయాడు. చాలా 'దేశాలు' తిరిగి వచ్చా నన్నాడు. రెండుగా చీలిపోయిన వారిని కల్పాలని తాపత్రయపడ్డాడు. బాగా బిగిసిన వారి మధ్య సఖ్యత కుదర్చలేక పోయాడు. పైగా తానా ప్రయత్నంలో వుండగా మరో ముఠాగా విడిపోయారు వాళ్ళలో కొంతమంది మొత్తం మూడు ముఠాలు తయారయ్యాయ్!

ఒకనాటి రాత్రి అందరినీ సమావేశ పర్చాడు తనకు తోచిన సలహా చెప్పాడు. ఆ విధంగా నడుచుకొంటే అందరికీ బావుంటుందన్నాడు. రావులు సలహా అందరికీ ఆమోదయోగ్యంగా తోచింది. సరేనన్నారు.

మొత్తం నాలుగు ముఠాలుగా విడదీసాడు వారిని. ఏటిలోని సిమెంటు రోడ్డుని కూడా నాలుగు భాగాలుగా విభజించాడు. ఏ భాగంలో వెహికల్ (వారి భాషలో బండి) కూరుకుపోతే ఆ ముఠావారే దాన్ని బయటకు లాగాలి. మిగతావారు పేచీలు పెట్టరాదు. బేరం పెరగడానికి మాత్రం తక్కిన ముఠాలు యధాశక్తి సహాయపడాలి. ఏ ముఠా ఏరియాలో బండి కూరుకుపోయిందీ తేల్చుకోవడంలో పేచీలు రాకుండా కట్టు దిట్టమైన యేర్పాట్లు గూడా చేసాడు. ఏవైనా పేచీలు వస్తే రావులుదద్ద నిర్ణయానికి అందరూ కట్టుబడి వుండాలి. అతను మాత్రం ఏ ముఠాకీ చెందకుండా 'నో పార్టీ మాన్'గా వుంటాడు. బేరంలో రూపాయికి వేడా వాటా అందరూ

అతన్కి ముట్టజెప్పాలి. రావులుదద్ద నిర్ణయాల్కి షరతుల్కి అందరూ వొప్పుకొన్నారు.

బేరాలు యెక్కువగా తగలడంకోసం రాత్రిళ్ళు సిమెంటు రోడ్డుకి ప్రక్కల అక్కడక్కడా గోతులు తీయిస్తాడు రావులుదద్ద తన పర్యవేక్షణ క్రింద. రావులుదద్ద వచ్చాక వారిలో తగవులు రాలేదు. బేరాలు యెక్కువగా రాసాగాయ్.

ఏదైనా బండి యిసుకలో కూరుకొని పోతే పొంచి చూస్తారు. కానీ తమకు తాముగా ముందుకు పోరు. నిస్సహాయ స్థితిలోపడి డ్రైవరు తమను పిలిచే వరకూ వేచియుంటారు. అతను సహాయం అర్థించాక ఏ ముఠాకి చెందిన వాడ్ని కేకవేసినా, ఆ యేరియా తనది కాకపోయినా సరే వెళ్తాడు. సహాయం చేస్తామని ఆ ముఠావాళ్ళని కేకవేసి తీసుకొస్తాడు. అప్పుడు బేరాలు మొదలవుతాయ్. పాతికనుంచి రెండు మూడు వందల వరకూ వుంటుంది వాళ్ల రేటు. బండి యజమాని, లేక డ్రైవరు ఆర్థిక స్తోమతనుబట్టి, అవసరం అనుసరించీ వాళ్ళ రేటు పెరుగుతుంది. రావులుదద్ద దారితప్పోయే దానయ్యలా అవతరించి మధ్యవర్తిగా వ్యవహరించి బేరం సెటిల్ చేస్తాడు సాధ్యమైనంత ఎక్కువలో.

* * *

"ఏదో బండి వస్తోందిరా సిమ్మాచలం!"

కొండ దిగుతూ కన్పించే బండి హెడ్ లైట్సును చూసి ఆశగా అన్నాడు అసిరియ్య.

"అది సొసైటీ బండి మావా! అడ్డాకులు తోలుతున్నారు!"

నిరుత్సాహపడ్డాడు అసిరియ్య.

"రెండు రోజులుబట్టి మా సత్తెంగాడికి బేరం తగల్నేదు!"

"అందులో నీ అల్లుడు యీరిగా డున్నాడనేటి మావా జాలి తలుత్తున్నావ్! కిందటోరం ఒక్కోడు నూటపది రూపాయిలు పంచుకున్నారు గదా! అయినా ఆడు తాగి తందనాలాడ్తవేం గానీ నీ కొక్కానీ ఈయడుగందా!"

అసిరియ్య మాట్లాడలేదు. వాడి దృష్టి అంతా కొండ దిగుతూన్న బండి మీదనే వుంది. బండి దగ్గరికి రాగానే పోల్చుకున్నాడు.

"సొసైటీ బండేరా అల్లుడూ!" అంటూ గబగబా అడుగులువేసి రోడ్డెక్కి నిలబడ్డాడు అసిరియ్య

అంతవరకూ స్పీడుగా వచ్చిన లారి నెమ్మదిగా యేట్లో దిగి తనవైపు ఒడ్డుకు రాగానే ఎదురుగా వెళ్ళి రోడ్డు పక్కనా నిల్చున్నాడు. లైట్లకాంతికి కళ్ళకడ్డంగా చేయిపెట్టి పరీక్షగా చూసాడు.

బండిని అసిరియ్యకు దగ్గరగా ఆపాడు డ్రైవరు ఖాదర్.

"ఏరా పట్నం వస్తావా?" పలక రించాడు అసిరియ్యని, చేతిలో బీడిని క్రింద పారేస్తూ.

ఆ గ్రామస్తులు ఆ బళ్ళమీద ఎక్కడికి వెళ్ళినా డబ్బియనవసరం లేదు. ఒకవేళ యిచ్చినా వారు పుచ్చు కోరు. వాళ్ళకి తెల్సు వీళ్ళ అవసరం ఎప్పుడైనా పడొచ్చని. అందుచేత ఆ గ్రామస్తులతో సదా మంచిగానే వుంటారు ఆ రోడ్డున పోయే బండివారంతా.

"రాను బాబూ! ఏ టీ యాళింతాలీసం అయిపోనాది?" కుశలప్రశ్న లేస్తూ ఆశగా చూసాడు అసిరియ్య. అది మామూలు పలకరింపే గనుక జబాబు చెప్పలేదు డ్రైవర్ ఖాదర్.

"ఆ వలేసుకొని నిల్చున్నది సిమ్మా చెలమేనా? ఏపీ పడ్డట్టు లేదే"

నవ్వుతూ వెటకారంగా అడిగాడు.

"ఇయ్యేల గొడ్డురోజు బాబూ! ఒకటీ పడ్డేదు! సుట్టముక్క లయిపోనాయ్ బాబూ!"

అంటూ బుర్ర గోక్కున్నాడు ఆశగా.

వాళ్ళు చుట్టముక్కలడిగినా తాము చుట్టలీయకూడదన్న అండర్‌స్టాండింగ్ వుంది ఆ లైను డ్రైవర్లందరిక్కీ.

జేబులోంచి రెండు రూపాయిలు తీసి అసిరియ్య చేతిలో పడేసి

"నువ్వూ, సిమ్మాచెలం తీసుకోండి!" అన్నాడు.

మహదానందం పొందాడు అసిరియ్య.

ఖాదర్ బండిని స్టార్టు చేస్తూంటే "కొండమీద బళ్ళేవయినా వున్నాయేటి బాబూ?" అడిగాడు.

"ఏం లేవురా!" బండి శబ్దంలో అస్పష్టంగా విన్పించినా అర్థంఅయింది అసిరియ్యకి. నిరాశగా కదిలాడు.

అసిరియ్య మావ బండి దగ్గరికెళ్తే సుంకం వసూలు చేయకుండా వదలడన్న సంగతి సింహాచలానికి బాగా తెల్సు. అందుకే అసిరియ్య దగ్గరికి రాగానే అడిగాడు.

"ఖాదరుగారి బండి నాగుంది! సుట్ట ముక్కలడగనేక పోనావా?"

"నా యాల! పసిగట్టేసినాడు!" స్వగతం పలుక్కున్నాడు అసిరియ్య.

"రెం డ్రూ పా యి లి చ్చి నా డు!" చెప్పాడు చీకాగ్గా.

సింహాచలం వల బయటకు తీసి తుప్పమీద పెట్టాడు. గబగబా ఒడ్డు చేరాడు.

"రెండు గంటలయింది మావా! కాళ్ళు పీకులు పట్టుకొన్నాయ్! ఒళ్లంతా సలట్టుకుపోనాది! ఓ సుక్కేసుకొని వత్తా! వల నీ వట్టుకో,"

"ఈ రెండ్రూపాయిలట్టుకెళ్ళి నాకో గ్లాసట్టుకొని రా! సూరిగాడితో సెప్పు! ఆనక గ్లాసట్టుకొని వత్తానని!"

అంటూ అసిరియ్య అందించిన రెండు

ఠా హౌ యి అూ ' తీసుకొన్నాడు సింహాచలం ఏసీ సమాధానం చెప్ప కుండానే చీకటిలో కల్సిపోయాడు.

"సీ! మల్లీ యియ్యేలగూడా అప్పడు గాడి ముతాకే బేరం దొరికింది! మా కొకటి నేదు!"

విసుక్కొంటూ వలని నీటిలో గుచ్చాడు అసిరియ్య.

గంట పోయాక తిరిగొచ్చాడు సింహాచలం, కూడా రావులుదద్దని వెంట వేసుకొని.

"ఏటిరా యియ్యేలకూడా బేరం తగల్నేదుట!" దూరంనుంచే పలకరిం చాడు రావులుదద్ద. మాటలు ముద్ద ముద్దగా వున్నాయ్.

"ఏటి దద్దా! యింతాలీసం! లాట్టు బండిలో వచ్చినా వేంటి? కొండమ్మ రానిచ్చిందా?"

పరాచికం ఆడాడు అసిరియ్య.

"దానికి తాగట్టా నేటిరా? ఎందుకు రానీదు?"

అసిరియ్య దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు రావులుదద్ద.

మబ్బులు విడటంతో వెన్నెల బాగా కాస్తోంది.

వెనక్కి తిరిగి సింహాచలాన్ని చూసాడు అసిరియ్య. అతని చూపులోని అర్థం గ్రహించాడు సింహాచలం.

"నీ రూపాయెట్టి రావులుదద్ద కవాపుల్లలు కొనీసినాడు మావా." చెప్పాడు దోషిలా.

అసిరియ్య ఏదో అనబోతుండగా మధ్యలో అందుకొన్నాడు రావులుదద్ద.

"అప్పయ్యమ్మ తెచ్చింది రా కవాపుల్లలు! మా గొప్ప రుచిగా వున్నా యనుకో! కొనేసాను నీ రూపాయిచ్చి! నువ్వేమీ యిదవకా! మన ముగ్గురికీ మూడు గ్లాసులు పంపమని సూరిగాడితో చెప్పా! వొట్టుకొస్తాడు!"

భరోసా యిచ్చాడు రావులుదద్ద.

అసిరియ్యకి వొళ్ళు మండింది. సింహాచలం మీద భలే కోపం వచ్చింది. అయినా ఏమీ అనలేకపోయాడు.

"అదిగో మావా! ఏదో బండి కొండ దిగుతోంది!" కొండవైపు చూస్తూ చిన్నగా కేకేసాడు సింహాచలం. అందరూ ఆశగా ఆత్రుతగా అటువైపు చూసారు. ఆ బండి హెడ్‌లైట్లు సెర్చి లైట్లులా కాంతిని విరజిమ్ముతున్నాయ్.

"నారీ కాదనకుంటారా దద్దా!"


సందేహం వెలిబుచ్చాడు సింహాచలం.

"కారునా?నే వుందిరా అల్లుడూ!" అన్నాడు అసిరియ్య.

"కారైతేనే మంచిదిరా మావా! మారాజుల కారైతే నా సావిరంగా! యిక సూస్కో మజా!" ఆనందాన్ని వ్యక్తం చేశాడు రావులుదద్ద.

ఆ బండివైపే చూస్తూ పదినిమిషాలు గడిపారు. దగ్గర పడుతూంచే ఎవరి మట్టుకు వారు సర్దుకొన్నారు.

రావులుదద్ద మరో వల తీసుకొని



తోట్టుకి దగ్గరగా పోయి నీటిలో వేసాడు. సింహాచలం దూరంగా పోయి చుట్ట కాల్చుకొంటూ కూర్చున్నాడు రాతిబండ మీద.

అంతా నిశ్శబ్దం. ఎదురుగా వచ్చిన ఆ కారు నీటిలో దిగింది అంతా ఆశగా అటువైపే చూస్తున్నారు. డ్రైవరుకు ఆ తోడ్డు కొత్త కాబోలు! కంగారుపడ్డాడు. అంచనా తప్పింది. కుడివైపుకి వొరిగి పోయింది కారు

డ్రైవరు వ్యర్థప్రయత్నం చేసాడు పదినిముషాలపాటు. ప్యాంటు ఎగదోసి క్రిందికి దిగాడు అతని కాలు కూడా గోతిలో పడింది ప్యాంటు తడిసి పోయింది. నలువైపులా చూసాడు. హెడ్‌లైట్ల కాంతిలో ఎదురుగా రావులు దద్ద కన్పించడంతో ధైర్యం పుంజు కొచ్చింది. మెల్లిగా అడుగులో అడుగు వేసుకొంటూ రావులు దద్దని సమీపించాడు

"ఏటి బాబూ! బండి కూరుకు పోయిందా?"

ఆదుర్దా ప్రదర్శిస్తూ అడిగాడు రావులు దద్ద.

"అవునోయ్! అయ్యగారు అర్జంటుగా వైజాగ్ వెళ్ళాలి! కొంచెం సాయం కావాలి!" అర్థించాడు.

రావులు దద్ద మాట్లాడలేదు. వలని పైకెత్తి చూసాడు. చేప పడింది. పట్టుకోబోయాడు జారిపోయి నీటిలో పడింది.

దూరంనుంచి అంతా గమనిస్తూన్న సింహాచలం కేకేసాడు.

"లెగు మావా! పోదాం! కొండపైద వర్షం బాగా కురుస్తోంది! వరద పెద్దదయే నాగుంది!"

సింహాచలం మాటలకి భయంతో వొణికిపోయాడు ఆ కారుడ్రైవరు. వరద పెద్దదైతే తన కొంప మునుగుతుంది! డ్రైవింగ్‌లో తను అపమర్ధుడని అయ్యగారు విసుక్కొంటారు! ఆ పైన వుద్యోగం వూడినా వూడొచ్చు.

"నే పోతున్నారా దద్దా!"

దూరంనుంచి అసిరియ్య కూడా కేకేసాడు.

"ఇదిగో వచ్చేత్తున్నారా!"

తిరిగి జవాబిస్తూ వలని బయటకు తీసాడు రావులుదద్ద.

తన గోడు వినిపించుకోకుండా వారంతా పోవడానికి వుద్యుక్తులవు తూంటే బావురుమన్నాడు డ్రైవరు.

"చూడు దద్దా! బండి గోతిలో దిగబడింది! వొడ్డుకి లాగాలి! ఎంత డబ్బియ్యమన్నా యిస్తాం! సాబ్ అర్జంటుగా వైజాగ్ వెళ్లాలి!"

బ్రతిమాలాడు రావుల్ని.

"ఏంటి దద్దా అంటాడు?"

ఏమీ తెలియనట్టుగా అడిగాడు సింహాచలం.

"బండిని బయటికి లాగాలంటే పది మందుండాల! ఇంత రాత్రప్పుడు కట్టవేఁ బాబూ!"

ఎట్టకేలకు సమాధానం యిచ్చాడు రావులుదద్ద, సాఫీగా.

వాళ్ళు కదలబోతూంటే అడ్డంగా నిలబడ్డాడు డ్రైవరు.

"ఎంత డబ్బయినా యిస్తాం! పోయి మనుషుల్ని తీసుకొనిరా! సాబ్ బండిలో వున్నారు!"

కాళ్ళా వేళ్ళా పడ్డాడు డ్రైవరు.

బండివైపొకసారి చూసాడు రావులు దద్ద. లైట్లకాంతిలో అతని కళ్ళు జిగేలు మన్నాయ్. కళ్ళు నులుపుకొన్నాడు


"మరయితే పిలుత్తాగానీ ఆళ్ళు సానా అడుగుతారు బాబూ!" చెప్పాడు కారు వైపే చూస్తూ.

"అయినా ఫర్వాలేదు!" తొందర చేసాడు డ్రైవరు అతని పరిస్థితిని గమనించాడు రావులు. "పెద్ద చేపే పడింది!" అనుకొన్నాడు.

"ఒరేయ్ సిమ్మాచెలం! పోయి మనోళ్ళని కేకెయ్యిరా! కట్టం ఎవరికైనా వత్తాది!"

సానుభూతి ప్రకటించాడు రావులు దద్ద డ్రైవరు మనసు స్థిమితపడింది.

సింహాచలం వూళ్ళోకి పోయి నలుగుర్ని లాక్కొచ్చాడు. అంతా కలిసి కారుని బయటకు లాగారు. కారులో వెనుకసీటులో ఎవరో పెద్దాయన కూర్చొని వున్నాడు. ఆయన ఠీవి చూసి 'డబ్బుగలాయనే!' అనుకొన్నారంతా. అంతా చేతులు కట్టుకొని నిలబడి ఆ




పెద్దమనిషివైపు ఆశగా చూసారు. ఆయన తన జేబులోంచి పర్సును బయటకు తీసారు. వందరూపాయిల నోటుని తీసి డ్రైవరుకు అందించారు ఆ నోటుని అందుకొని కారు కెదురుగా వెళ్ళి లైటు కాంతిలో దీక్షగా చూసాడు రావులు. 'మంచి నోటేలే! కొత్తనోటు!' అన్నాడు డ్రైవరు.

"అదికాదు బాబూ! మడతలు పెట్టి వుంచేనూ! విప్పి చూసా అంతే." తన ప్రవర్తనకు నొచ్చుకొన్నాడు రావులు.

డ్రైవరు కారెక్కి స్టార్టు చేసాడు.

"థాంక్స్ బాబూ!" కారులోనికి వొంగి చేతులు జోడించి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించాడు రావులుదద్ద

కారు కదిలింది.

అంతా కారు వైపే చూస్తున్నారు. ఏభైగజాల దూరం వెళ్ళి కారు ఆగింది మళ్ళీ ఎందుకాగిందో అర్థంగాక అంతా గబగబా అడుగులు వేసారు. రావులుదద్ద అందరికన్నా ముందు నడుస్తున్నాడు. కారును వెనక్కి నడిపించాడు డ్రైవరు. మరు నిమిషంలో అందరి ముందూ ఆగింది

"రావులూ!" పిల్చాడు డ్రైవరు

"చిత్తం! పిల్చారా!" డ్రైవరుకు దగ్గరగా నిలబడి వినయంగా అడిగాడు రావులుదద్ద.

డ్రైవరు ఏమి చెబుతాడో అని అంతా ఆశక్తిగానూ కుతూహలంగానూ వున్నారు.

డ్రైవరు కిందికి దిగాడు.

"బాబుగారు పిలుస్తున్నారు" అన్నాడు డ్రైవరు.

బాబుగారికి దగ్గరగా నిలబడి అతి వినయంగా

"తలపీయండి బాబూ!" అన్నాడు రావులుదద్ద.

ఆయన తన భాషలో ఏదో అన్నారు. భాష అర్థంగాక అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకొన్నారు. డ్రైవరు వైపు చూసాడు రావులుదద్ద.

"అయ్యగారు నీ సహాయానికి ప్రతి ఫలంగా నీకు పాతిక రూపాయలు స్పెషల్ యినాం యిస్తామంటున్నారు."

తెనిగించాడు డ్రైవరు.

ఆనందంతో తబ్బిబ్బయిపోయాడు రావులుదద్ద

"రావులు భలే సాన్సు కొట్టేసి నాడురా!" అన్నాడు సింహాచలం పైకే.

"నంజకొడుకు కట్టబడిపోయాడని ........." ఇంకా ఏవేవో బూతులు తిట్టుకొన్నాడు ఆసిరియ్య స్వగతంలో.

అయ్యగారు పర్సులోంచి మరో వంద రూపాయిల కాగితం తీసి డ్రైవరికిస్తూ ఏదో అన్నారు వారి భాషలో.

"పాతిక తీసుకొని మిగతాదిచ్చేయ్!" అన్నాడు డ్రైవరు చేతిలో నోటుతో.

"నూర్రూపాయిల సిల్లరే? మా దగ్గర నేదు బాబూ! తవరిచ్చిన నోటే వున్నాది!" అన్నాడు గాబరాగా రావులు దద. రావులుదద్ద మాటలు ఆయనకు అర్థం అయాయ్ కాబోలు. మరల ఏదో చెప్పారు డ్రైవరుతో.

"విజయనగరంలో మార్చి యిస్తా రంట! అక్కడికి మా కారులో రమ్మం టున్నారు అయ్యగారు!"

చెప్పాడు డ్రైవరు.

సంతోషంతో ఎగిరి గంతేసాడు రావులుదద్ద. 'రాత్రికి విజయనగరం! పాతిక రూపాయిలతో! కొండమ్మ రాత్రికి వుండిపోమనే చెప్పింది! డబ్బు లేక తిరిగొచ్చేసాను! పాతిక రూపాయిల్తో కొండమ్మతో రాత్రికి జల్సా చెయ్యొచ్చు!' అనుకొని పొంగిపోయాడు.

"అలాగే బాబూ!" అన్నాడు.

డ్రైవరు డోరు తెరిచి తన ప్రక్కనే కూర్చోబెట్టుకొన్నాడు. కారు కదిలింది.

ఆ రాత్రి వెళ్ళిన రావులుదద్ద మూడు రోజులయినా తిరిగి రాలేదు. నాలుగో రోజున ఆ వూరి మాష్టారు న్యూస్ పేపరు పట్టుకొచ్చి అందరికీ చదివి వినిపించారు. అందులో పడిన వార్తని. ఆ తర్వాత రావులుదద్ద ఫోటో చూపించారు.

"బస్తర్ అడవుల్లోని బందిపోటు ముఠా నాయకుడు రావులు పురప్ త్రినాథ్ పట్టుబడిన వైనం!" అంతా వివరంగా చదివి వినిపించారు.

"ఆఁ! యేల కారులో వున్నాయన పోలీసాఫీసరన్న మాట!" తెల్లబోయారంతా.